విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 13, ఫిబ్రవరి 2025

గిరిజనుల చట్టాన్ని రద్దు చేసే ఆలోచన విరమించుకున్నందుకు హర్షనీయం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : గిరిజనుల చట్టాన్ని 1/ 70 రద్దు చేసే ఆలోచన లేదని తెలిపిన రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుకు ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కాలింగిరి రాముడు ధన్యవాదాలు తెలిపారు. గిరిజనుల చట్టాన్ని 1/ 70 రద్దు చేసే ఆలోచన రాష్ట్ర ప్రభుత్వానికి ఏం మాత్రం లేదని పాడేరు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ అఖిలపక్ష సమావేశంలో తెలపడం జరిగిందని, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి కూడా గిరిజన చట్టాన్ని1/70 తొలగించట్లేదని చెప్పడం జరిగిందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గిరిజన చట్టాన్ని1/70 ఎలాంటి మార్పు కానీ, గిరిజన చట్టాన్ని తొలగించట్లేదని తెలపడంతో ఆంధ్ర ప్రదేశ్ గిరిజన ప్రజలందరూ సీఎంకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఆయన తెలిపారు. గిరిజనులకు, కులవృత్తుల కోసం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వములు సహాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాలింగిరి రాముడు కోరారు.

సామూహిక ఇంకుడు గుంతల నిర్మాణాలకు ప్రణాళికలు సిద్ధం చేయండి

విశాలాంధ్ర - చాగలమర్రి : ప్రతి గ్రామంలో మూడు సామూహిక ఇంకుడు గుంతల నిర్మాణాలకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపిడిఓ రాజేంద్రప్రసాద్, ఈఓపిఆర్‌డి తాహీర్‌హుసేన్‌లు కోరారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయితీ కారదర్శులు,సచివాలయాల ఇంజనీరింగ్ సహాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 15వ తారీకు లోపల మండలంలో ఉన్న 14 చెత్త సంపద కేంద్రాలకు సంబంధించిన చిన్న చిన్న మరమ్మతులు ఉన్నట్లయితే చేయించి వర్మి కంపోస్టు తయారీ పనులను చేపట్టాలన్నారు. ఫిబ్రవరి 15 స్వచ్ఛత దివాస్ కార్యక్రమంపై కార్యాచరణ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్లుఎస్ ఏఈ జగ్గయ్య, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ రాజ్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లో పాల్గొన్నారు.

యంత్రం కుదిరింది.. శ్రమ తగ్గింది

విశాలాంధ్ర - చాగలమర్రి : గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ శాతం ప్రజలకు వ్యవసాయం, పాడి పరిశ్రమే జీవనాధారంగా ఉంటుంది. పాడి రైతులు నిత్యం పశుగ్రాసం కోసేందుకు కొడవళ్లు వాడతారు. చాగలమర్రి పట్టణంలోని పాడి రైతు రామకృష్ణ పశుగ్రాసం కోసే యంత్రాన్ని రూ.9 వేలకు కొనుగోలు చేశారు. గంటల తరబడి పశుగ్రాసం కోసే పని లేకుండా కొన్ని నిమిషాల్లోనే తక్కువ శ్రమకే పని పూర్తవుతుందని పాడిరైతు చెబుతు న్నారు. ప్రభుత్వాలు స్పందించి ఇలాంటి యంత్రాలు రాయితీలో అంది వ్వాలని కోరుతున్నారు.

ప్రతి రైతు రిజిస్ట్రేషన్ చేయించుకోండి

విశాలాంధ్ర - చాగలమర్రి : రైతులు ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య కొరకు ప్రతి రైతు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి రంగనేతాజీ తెలిపారు. బుధవారం మండలంలోని గొడెగనూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి మొక్కజొన్న సాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు గురించి రైతులకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య కొరకు ప్రతి రైతు రిజిస్ట్రేషన్ చేయించుకోవలసినదిగా తెలిపారు. రాష్ట్రంలో భూమిగల ప్రతి రైతు ఒక ప్రత్యేక రైతు గుర్తింపు సంఖ్య ఇవ్వటం ద్వారా వ్యవసాయ సేవలను సులభతరం చేసి పారదర్శకంగా అందుబాటులోకి తీసుకొని రావటం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అని అన్నారు. భూ ఆధారిత పథకాలైన పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ,పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, రాయితీపైన సూక్ష్మ పోషకాలు, వ్యవసాయాం త్రీకరణ, పంట రుణాలు వంటి పథకాలకు వర్తిస్తుందని అన్నారు. మీ గ్రామంలోని రైతు సేవా కేంద్రాల్లోని గ్రామ వ్యవసాయ ఉద్యానవన సహాయకులను సంప్రదించి రైతు గుర్తింపు సంఖ్య పొందవచ్చు అని తెలిపారు రైతులు వారి యొక్క ఆధార్ నంబర్, ఆధార్ అనుసంధారక ఫోన్ నెంబర్, భూమి రికార్డు వివరములు తీసుకొని రైతు సేవ కేంద్రం సిబ్బంది సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందిగా రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విహెచ్‌ఏ ప్రసన్నకుమార్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

మండల సహాయ కార్యదర్శి సస్పెండ్

విశాలాంధ్ర-డోన్ : డోన్ సీపీఐ మండల సహాయ కార్యదర్శి వరదరాజులను సస్పెన్షన్ చేసినట్లు సీపీఐ నాయకులు బుధవారం ప్రకటనలో తెలిపారు. మండల సహాయ కార్యదర్శి వరదరాజులు పార్టీ క్రమశిక్షణను ఉల్లంగించి నందున సీపీఐ,ప్రజా సంఘాల నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.సుంకయ్య, మండల కార్యదర్శి నారాయణ, సీపీఐ పట్టణ కార్యదర్శి మోట రాముడులు తెలిపారు. సీపీఐ జిల్లా కమిటీ నిర్ణయం మేరకు పార్టీ క్రమశిక్షణను దృష్టిలో ఉంచుకుని తొలగించినట్లు వెల్లడించారు.

సారా బెల్లం స్వాధీనం

విశాలాంధ్ర - డోన్ రూరల్ : అక్రమంగా సారా తయారు చేస్తున్న ప్యాపిలి మండలం హుస్సేనాపురం గ్రామం దగ్గర గాండ్ల మల్లికార్జునను అదుపులోకి తీసుకుని 45 సంచుల బెల్లం స్వాధీనం చేసుకున్నట్లు నంద్యాల జిల్లా ఎక్సైజ్ ఎన్ఫోర్స్ మెంట్ సూపరిండెంట్ రాముడు తెలిపారు. కలచట్ల గ్రామానికి చెందిన మహేష్ అనే వ్యక్తి నుండి తాను బెల్లం కొనుగోలు చేసినట్లు మల్లికార్జున చెప్పారనీ అన్నారు. 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు రాముడు తెలిపారు.

బెల్ట్ షాపులను అరికడతాం : సీఐ

మండలంలో బెల్ట్ షాపులు నిర్వహిస్తే సహించబోమని డోన్ ఎక్సైజ్, ఎన్ఫోర్స్ మెంట్ సిఐ వరలక్ష్మి అన్నారు. ఏ గ్రామంలోనైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందిన వెంటనే తాము వెళ్లి అక్కడ విచారించి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కొంత మంది ప్రవేట్ వ్యక్తులు 25 వేల రూపాయలు డిపాజిట్ అడుగుతున్నారని సిఐ దృష్టికి తీసుకువెళ్లగా అటువంటిది ఏమీ తమ దృష్టికి రాలేదని, అలాంటి వారికి దండన తప్పదన్నారు. నాటు సారా తయారు చేసే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని సిఐ వరలక్ష్మి హెచ్చరించారు.

పచ్చని చెట్లు ప్రగతికి సోపానం

విశాలాంధ్ర- వెలుగోడు : పట్టణంలోని ఐదవ సచివాలయం వద్ద పల్లెవనం కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్రభుత్వ అధికారులు టీడీపీ,జనసేన,బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. శ్రీశైలం నియోజ కవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు టీడీపీ మండల అధ్యక్షులు అన్నారపు శేషిరెడ్డి ఆధ్వర్యంలో పార్కులో మొక్కలు నాటారు. తహసిల్దార్ శ్రీనివాసులు గౌడ్, ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి, ఎన్‌ఆర్ ఈజీఎస్ ఏపీవో మల్లికార్జున, ఫారెస్టర్ గోపి, పంచాయతీ కార్యదర్శి సుంకన్నలు మాట్లాడుతూ మొక్కలు నాటడం పల్లె ప్రగతికి సోపానమని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మాజీ సర్పంచ్ అబ్దుల్ కలాం, పాల శంకర్‌రెడ్డి, డాక్టర్ జాకీర్ హుస్సేన్, జనసేన నాయకులు షాలు బాషా, అమీర్ హంజా, బిజెపి నాయకులు ప్రతాప్ ఆచారి, టిడిపి నాయకులు ఫారెస్ట్ అధికారులు. కార్యకర్తలు పాల్గొన్నారు.

సకాలంలో రుణాలు చెల్లించండి

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ పరస్పర సహకార సంఘంలో పలు రుణాలు తీసుకున్న రైతన్నలు సకాలంలో తిరిగి చెల్లించాలని సొసైటీ సీఈవో మీర్జా మహబూబ్ బేగ్ పిలుపునిచ్చారు. స్థానిక సొసైటీ కార్యాలయంలో ఫీల్డ్ మేనేజర్ సుబ్బరాయుడు అధ్యక్షతన రుణాల రికవరీపై రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. ఈ సందర్భంగా సీఈఓ భేఫు మాట్లాడుతూ శిరివెళ్ల సొసైటీ పరిధిలో స్వల్పకాలిక రుణాలు 2కోట్ల 50 లక్షలు, దీర్ఘకాలిక రుణాలు 1కోటి 50లక్షలు, రైతు నేస్తం, రాజన్న చేయూత, పథకం కింద 8 కోట్లు, మరియు కౌలు రుణాలు 38లక్షలు బకాయిలు ఉన్నట్లు తెలిపారు. మార్చిలోపు తీసుకున్న రుణాలు చెల్లించి ఏడు శాతం వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని పిలుపుని చ్చారు. సొసైటీలోని లావాదేవీలు మార్చి అనంతరం ఆన్లైన్ కాబోతున్నా యని మార్చిలోపు రుణాలు తీసుకున్న రైతన్నలు చెల్లిస్తే అపరాధ వడ్డీ నుండి విముక్తి పొందుతారని సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది నాగులయ్య హుస్సేన్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

టెండర్ ప్రకటన

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య శాఖ
నందికొట్కూరు సబ్ డివిజన్-I

నంద్యాల జిల్లా, నందికొట్కూరు మండలం పరిధిలోని సమీకృతో రక్షిత నీటి సరఫరా పథకములోని 55 HP HSC పంపుసెట్లు కొరకు రూ.6.25 లక్షలు మిగిలి ఉన్న యూజర్ చార్జెస్ గ్రాంట్ క్రింద బిడ్ డాక్యుమెంట్లు 12.02.2025 నుండి 18.02.2025 వరకు పని దినములయందు అందుబాటులో ఉండును. మరింత సమాచారం కొరకు 9100122422 నంబరు నందు సంప్రదించగలరు.

Sd/- ఉప కార్యనిర్వాహణ అధికారి
గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్యశాఖ
నందికొట్కూరు సబ్ డివిజన్-1

అభివృద్ధికి సహకరిస్తాం

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడును ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, తాలూకా యువ నాయకులు భార్గవ రామ్‌లు బుధవారం ఢిల్లీలో కలిశారు. కర్నూల్ ఎయిర్ పోర్టును అభివృద్ధి చేయాలని అలాగే ఆళ్లగడ్డ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు సహకరించాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుని కోరారు. కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి ఆళ్లగడ్డ ప్రాంతంలో ఇండస్ట్రీస్‌కు సహకరిస్తామని తెలిపారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంచుకోవాలి

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలని మండల అధికారులు తెలిపారు. బుధవారం మండలంలోని పెట్నికోట గ్రామం జడ్పిఉన్నత పాఠశాలలో విద్యార్థులచె నిర్వహించిన సైన్స్ ప్రయోగాన్ని అధికారులు పరిశీలించారు. తాసిల్దార్ బాలీశ్వర రెడ్డి, ఎంపీడీవో ప్రసాద్ రెడ్డి, ఎంఈఓ అబ్దుల్ కలాంలు జెడ్పిఉన్నత పాఠశాలలో 10వ తరగతి ప్రీ ఫైనల్ ఎగ్జామ్ పరిశీలించి అనంతరం సైన్స్ ల్యాబ్‌లో విద్యార్థుల సైన్స్ ప్రయోగాన్ని పరిశీలించారు. మూఢనమ్మకాలకు దూరంగా ఉండి శాస్త్రీయ విజ్ఞానంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఉపాధ్యాయులు చంద్రశేఖర రావు, రమణయ్య, విజయ భాస్కర్ రెడ్డి, బాల మద్దిలేటి,రాఘవేంద్ర ప్రసాద్,సుందర్రావు,రమేష్ పాల్గొన్నారు.

నేటి నుండి టెక్కే స్వామి ఉరుసు

విశాలాంధ్ర-అవుకు: మండలంలోని కునుకుంట్ల గ్రామ పొలిమేరలో వెలసిన శ్రీ హజరత్ అపాంశా వలి (టెక్క స్వామి) ఉరుసు మహోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమవుతాయని కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ కునుకుంట్ల గ్రామానికి చెందిన గూడాల సోదరులు గుడాల ప్రతాపరెడ్డి, గూడాల మురళీధర్ రెడ్డిల ఆధ్వర్యంలో ఈ ఉరుసు మహోత్సవాలు ఘనంగా నిర్వహించనునట్లు వారు పేర్కొన్నారు. ఉరుసు మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వారు తెలిపారు. ఉరుసు మహోత్సవాలను తిలకించేందుకు పొరుగు జిల్లాలైన కర్నూలు, కడప, అనంతపురం,చిత్తూరు అధిక సంఖ్యలో భక్తులు తరలిరాంగునట్లు పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వారి పేర్కొన్నారు. భక్తులకు గూడాల సోదరుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. భక్తుల సౌకర్యార్థము బనగానపల్లి, కోవెలకుంట్ల, తాడపత్రి డిపోల నుండి ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు.

పాఠశాలకు భవనాశి ట్రస్ట్ టీవీ బహుకరణ

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక చిన్మయ మిషన్ పాఠశాలకు భవనాశి వెంకటసుబ్బయ్య శెట్టి,శ్రీమతి వెంకమ్మ ట్రస్ట్ తరపున లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్, ఆర్యవైశ్య మహాసభ నంద్యాల జిల్లా అధ్యక్షులు భవనాశి నాగ మహేష్ తమ తండ్రి భవనాశి శ్రీరామమూర్తి జ్ఞాపకార్థం విద్యార్థులకు విద్యా బోధనలో ఉపయోగించడానికి పదివేల రూపాయల టెలివిజన్ బహూకరించారు. భవనాశి నాగ మహేష్ మాట్లాడుతూ తమ తండ్రి దివంగత భవనాశి శ్రీరామ్మూర్తి లయన్స్ క్లబ్ ద్వారా విశేష సేవలు అందించారని, వారి స్ఫూర్తితోనే తాము కూడా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు నిజాముద్దీన్, జిల్లా చైర్మన్ భవనాశి నాగ మహేష్, కోశాధికారి మామిళ్ల నాగరాజు, చిన్మయ మిషన్ స్కూల్ అధ్యక్షులు ఆంజనేయులు గుప్తా, కార్యదర్శి కశెట్టి కృష్ణమూర్తి, సీనియర్ లయన్స్ క్లబ్ సభ్యులు బవిరిశెట్టి శ్రీకాంత్, ఉపాధ్యక్షులు కూరా ప్రసాద్, సంయుక్త కార్యదర్శి సందీప్,సభ్యులు మేడా చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యం నా బాధ్యత

విశాలాంధ్ర - బనగానపల్లె : పట్టణంలోని టిడిపి కార్యాలయంలో బుధవారం బీసీ ఇందిరా రెడ్డి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. బీసీ ఇందిరా రెడ్డి మాట్లాడుతూ బనగానపల్లె పట్టణ ప్రజలు ఎన్నికలలో అత్యధిక మెజార్టీ టిడిపి పార్టీకి ఓటు వేసి తమను గెలిపించడం జరిగిందని ఏ మేరకు ప్రజల రుణం తీర్చుకోవాలన్న ఆలోచనలతోనే తాను ప్లాస్టిక్ నిర్మూలన చేపట్టాలని ఆలోచించడం జరిగిందని తెలిపారు. ఇందుకు అన్ని వర్గాల షాపులు వారు పూర్తిగా సహకరిస్తున్నారన్నారు. ప్లాస్టిక్ నిర్మూలనే లక్ష్యంగా గత జనవరి 15వ తేదీ నుండి బనగానపల్లె పట్టణంలో పూర్తిగా ప్లాస్టిక్ నిర్మూలన చేపట్టడం జరుగుతుందని మరికొన్ని చోట్ల అక్కడక్కడ ప్లాస్టిక్ వాడడం జరుగుతుందని వాటిని కూడా పూర్తిగా నిర్మూలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా వాణిజ్య విభాగ చైర్మన్ టంగుటూరి సీనయ్య,జక్కా శ్రావణ్, హైదర్, సంజీవరెడ్డి, బొంతల ఫణీంద్ర, వెంకటసుబ్బయ్య సంజీవరెడ్డి జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : నియోజకవర్గంలోని దొర్నిపాడు మండల పోలీస్ స్టేషన్ నూతన ఎస్.ఐగా హనుమంతరెడ్డి బుధవారం పదవి భాద్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బంది ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎస్సై హనుమంత రెడ్డి మాట్లాడుతూ మండలంలో అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపుతామని హెచ్చరించారు. మట్కా జూదం, నాటు సారా , బెల్టు షాపులు తదితర కార్యకలాపాలు కొనసాగిస్తే ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హనుమంత రెడ్డి హెచ్చరించారు. గ్రామాలలో ప్రజలు ఏదైనా సమాచారం ఉంటే తమ దృష్టికి తీసుకొని రావాలని కోరారు.

ఘనంగా ప్లాటినం జూబ్లీ వేడుకలు

విశాలాంధ్ర-పాణ్యం : మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయం నందు బుధవారం ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యం లో 75వసంతాలు పూర్తి చేసుకుని 76వ వసంతంలోకి అడుగుపెడు తున్న సందర్భంగా ప్లాటినం జూబ్లీ వేడుకలను 1104 విద్యుత్ కార్మికులు జెండా ఆవిష్కరణ చేసి ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించారు.లైన్మెన్ ఈశ్వరయ్య, వెంకట రాముడు మాట్లాడుతూ విద్యుత్ కార్మికులు నీతి నిజాయితీతో అంకితభావంతో వృత్తిపట్ల సేవా దృక్పథంతో విద్యుత్ యూనియన్ సమస్యలపై ఎనలేని పోరాటాలు చేసి ప్రతి విద్యుత్ కార్మికుడికి న్యాయం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎల్ఎంలు గోపాల్,శీను,జేఎల్ఎంలు షరీఫ్,షేక్షా,సుమన్,చంద్ర తదితరులు పాల్గొన్నారు.

15న స్వచ్ఛ ఆంధ్ర..

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఈనెల 15న మూడవ శనివారం సందర్భంగా స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్" కార్యక్రమాలను విధిగా నిర్వహించాలని ఆళ్లగడ్డ ఎంపీడీవో మహబూబ్ ఖాన్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని గ్రామాల పరిధిలో కూడా స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. ఆరోజున ఉద్యోగులకు ఎలాంటి సెలవులు కానీ పర్మిషన్లు గాని ఉండవని ఎంపీడీవో మహబూబ్ ఖాన్ తెలిపారు.

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థుల అద్భుత ప్రతిభ

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : 2025 జెఈఈ మెయిన్స్ ఫేస్ 1ఫలితాలలో రావూస్ విద్యార్థులు అద్భుతమైన ఫలితాలు సాధించినట్లు కళాశాల చైర్మన్ ఏఎంవి అప్పారావు, డైరెక్టర్ ఏ మోని చంద్ర తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ మాట్లాడుతూ గత 34 సంవత్సరాలుగా ఫలితాలు ఏవైనా ర్యాంకులు సాధించడం రావూస్ విద్యార్థులకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. ఇంతటి ఫలితాలు సాధించడానికి కారణమైన జాతీయ స్థాయి అధ్యాపక బృందానికి, తల్లిదండ్రులకు, విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. మా కళాశాల విద్యార్థుల జెఈఈ మెయిన్స్ ఫలితాల్లో పూర్ణేష్ రావు 98.059, కేఎస్ సహర్ష 97.757, జి.శ్రావ్య 96.411, ఎస్ సభ, 95.067, బి.తౌఫిక్ హుస్సేన్ 93.032, వి.వెంకట హరీష్, 91.322, జి.గురునాథ్ రెడ్డి: 89.534, శశాంక్ కుమార్ రెడ్డి 89.481, ఓమర్ షాకిబ్ 87.761 ఉత్తీర్ణతో రావూస్ విజయ పరంపర కొనసాగించారని డైరెక్టర్ ఏ మోహన్ చంద్ర తెలిపారు. జాతీయ స్థాయి మెటీరియల్ అయిన సింగేజి కరికులమ్‌ను బోధించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : జెయియి ఫలితాలల్లో న్యూక్లియస్ అకాడమీ విజయ దుందుంభి మోగిందిచినట్లు కళాశాల కరస్పాండెంట్ ఎస్.మురళీధర్ రెడ్డి తెలిపారు. ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థిని, విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ ఎస్. మురళీధర్ రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ విద్య కోసం ఇక నుండి విద్యార్థుల తల్లిదండ్రులు వ్యయ ప్రయాసల కోర్చి దూర ప్రాంతాలకు వెళ్ళాల్సిన అవసరం లేదని, నంద్యాల న్యూక్లియస్ అకాడమీ ద్వారా సీనియర్ నీట్ /జెఈఈ ఫ్యాకల్టీని ఏర్పాటు చేసి ఉత్తమ శిక్షణను అందిస్తునామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాల డైరెక్టర్ వాసుదేవరెడ్డి మాట్లాడతూ ప్రతి సంవత్సరం అత్యుత్తమ జాతీయ స్థాయి ర్యాంకులను సాధించడం న్యూక్లియస్‌కు సంప్రదాయంగా మారిందని, భవిష్యత్తులో న్యూక్లియస్ మరింత ఎక్కువ మంది ఐఐటీయన్లను నంద్యాల నుండి తయారు చేస్తుందన్నారు. కళాశాల సలహాదారులు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థులు దూరప్రాతాలలో ఉన్న విద్యాసంస్థలలో అధిక ఫీజులు చెల్లించి చేరుతున్నారని, మన ప్రాంతంలో మిగిలిన కొద్దిమంది విద్యార్థులతోనే అత్యుత్తమ ఫలితాలను సాధిస్తున్నామని, తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెయియి అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

నేర సమీక్షా సమావేశం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా బొమ్మలసత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో నంద్యాల సబ్ డివిజన్‌కు సంబంధించి నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో నేర నియంత్రణ కొరకు తీసుకోవలసిన చర్యలపై ప్రాధాన్యత క్రమంలో వివరించారు. ఈ సమావేశం నందు పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్ కేసులు వాటి స్థితిగతులు, నమోదైన కేసుల్లో నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తు వాటి వివరాలు పురోగతిపై సంబంధిత పోలీస్ అధికారులతో ఆరా తీసి కేసుల ఫైల్స్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యాక్రమం నందు జిల్లా ఎస్పీతో పాటు నంద్యాల ఎస్డిపిఓ మంద జావళి ఆల్ఫోన్స్, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ యుగంధర్ బాబు, సిఐలు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వీడండి : ఎంపీడీవో

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల పరిధిలోని యర్రగుంట్ల మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ఎంపీడీవో సి.శివ మల్లేశ్వరప్ప బుధవారం సందర్శించి పలు రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్యదర్శులు సిబ్బంది సచివాలయ సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం విడనాడాలని సమయపాలన పాటించాలని తెలియజేశారు. మేజర్ గ్రామపంచాయతీలో పారిశుద్ధ్య నివారణ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన నివారణా చర్యలు తీసుకోవాలని తెలియజేశారు యర్రగుంట్ల మేజర్ గ్రామపంచాయతీలో దోమల బెడద అధికంగా ఉన్నందున వాటి నివారణ కోసం ఫాగింగ్ పొగను గ్రామంలోని చివరి నివాసం వరకు విస్తరించాలని ఆదేశించారు. ఆలస్యంగా విధులకు హాజరు కావడం, సమయానికి ముందే విధులు ముగించుకొని ఇంటికి తిరిగి వెళ్లడం, క్షేత్రస్థాయి పరిశీలన లేకపోవడం, సమస్యల పరిష్కారానికి విముకత చూపడం వంటి ఆరోపణలు గ్రామ ప్రజల నుండి తలెత్తకుండా తగిన జాగ్రత్త వహిస్తూ విధులు నిర్వహించాలని ఎంపీడీఓ తెలియజేశారు. సర్పంచ్ సుభాన్ వలి గ్రామపంచాయతీ కార్యదర్శి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ 24 ఆధ్వర్యంలో రక్తదానం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ 24వ వార్షికోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ ఏర్పాటు చేసి 24సంవత్సరాలు పూర్తయినందున, నంద్యాల పద్మావతినగర్‌లో టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ నూతన కార్యాలయంలో బ్రాంచ్ మేనేజర్ కె.మహేష్, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ బాలరాజుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నంద్యాల జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల హాజరై రక్తదానం చేసిన ఉద్యోగులకు సర్టిఫికెట్లు పంపిణీ చేసి రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసిన మేనేజర్‌ను, వారి సిబ్బందిని అభినందించారు. ఈ రక్తదాన శిబిరంలో సుమారు 20 మందికి పైగా ఇన్సూరెన్స్ కంపెనీ ఉద్యోగులు రక్తదానం చేశారు. రెడ్ క్రాస్ ట్రెజరర్ నాగేశ్వరావు, కార్యవర్గ సభ్యుడు ఉస్మాన్ భాష తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షమీం బేగం సస్పెండ్

విశాలాంధ్ర - నంద్యాల అర్బన్ : ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షమీం బేగం సస్పెండ్ చేస్తున్నట్లు మహిళా సమాఖ్య నంద్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీదేవి, రజిత తెలిపారు. గురువారం నంద్యాల జిల్లా సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీదేవి, రజిత మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బాధ్యతలు నిర్వహిస్తున్న షమీంబేగంను క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర సమితి నిర్ణయం ప్రకారం సస్పెండ్ చేసినట్లు వారు తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యాలయం నందు ఎగ్జిక్యూటివ్ బాడీ సమావేశం తాలూకా అధ్యక్షులు కల్లూరి పెద్ద మస్తానయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఉప సభ అధ్యక్షులు బేతం శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు ఈడిగ వెంకట రమణ, పి.గుర్రప్ప, సహ కార్యదర్శి ఎం జనార్దన్ రావు, ఎగ్జిక్యూటివ్ బాడీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. గవర్నమెంట్ ప్రావిడెంట్ ఫండ్, సరెండర్ లీవ్స్, కరువు భత్యము, బకాయిలు త్వరగా చెల్లించాలన్నారు. మధ్యంతర భృతి త్వరగా ప్రకటించాలని తీర్మానం చేశారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు

www.visalaandhra.com

కర్నూలు, గురువారం 13, ఫిబ్రవరి 2025

అవకతవకలు జరక్కుండా చూడాలి

విశాలాంధ్ర - ఆదోని రూరల్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అవకతవకలు జరగకుండా ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ సూచించారు. బుధవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏపీవో కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశాన్ని ఉద్దేశించి ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వలసలు నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకం ప్రజలకు ఎంతగానో తోడ్పడుతుందన్నారు. ప్రజలు వ్యవసాయ కూలీలు ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొలతలు తీయిస్తూ, వ్యవసాయానికి శాశ్వతంగా ఉపయోగపడే పనులు చేపట్టాలని ఆదేశించారు. ఉపాధి హామీ పనులకు హాజరయ్యే అర్హులకు అన్యాయం జరగకుండా తగిన కొలతలు తీయిస్తూ, తగిన వేతనాలు కల్పించే విధంగా కృషి చేయాలన్నారు. ఉపాధి హామీ సిబ్బంది ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధి కూలీలతో పనులు చేయించాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు,టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలి : ఏఐవైఎఫ్

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: అమరావతిని ఫ్రీజ్ జోన్‌గా ప్రకటించి అక్కడ భర్తీ చేసే ఉద్యో గాల్లో 26 జిల్లాల వారికి అవకాశం కల్పించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు డిమాండ్ చేశారు, బుధవారం సీఆర్ భవన్ నందు జరిగిన విలేక రుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 6 నుండి 9 వరకు శ్రీకాకుళంలో 22 వ రాష్ట్ర మహాసభలు విజయవంతంగా నిర్వహించుకోవడం జరిగిందదన్నారు. ఈ మహాసభల్లో రాష్ట్ర వ్యాప్తంగా యువకులు ఎదుర్కొంటున్న సమస్యలపైన చర్చించి అనేక తీర్మానాలు చేయడం జరిగిందని ఆయన వివరించారు. 2014 రాష్ట్రం విడిపోయి నప్పటి నుంచి మూడుసార్లు సాధారణ ఎన్నికలు జరిగిన ప్పటికీ 2018లో మినహాయిస్తే ఇప్పటివరకు డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వకపోవడం రాష్ట్ర పాలకులకు విద్య పట్ల ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందని ఆయన విమర్శించారు. 2024 ఎన్నికలకు ముందు చంద్రబాబు నాయుడు తాను అధికారంలోకి వస్తే మొదటి సంతకం మెగా డీఎస్సీ పైనే పెడతానని హామీ ఇచ్చి, అధికారం చేపట్టిన తర్వాత సంతకానికే పరిమితమయ్యాడు తప్ప డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లు లోని పారి శ్రామిక హబ్ లో ఏర్పాటు చేసే పరిశ్రమల్లో స్థానిక యువత కే 75శాతం ఉద్యోగ అవకా శాలు కల్పిస్తామని జీవో తీసుకురావాలని, రాష్ట్ర వ్యాప్తంగా 2 లక్షల 60 వేల మంది వాలంటరీ లను కొనసాగించి వారికి గౌరవ వేతనం పదివేల రూపాయలు ఇవ్వాలని కోరారు. ప్రతి సంవత్సరం ఏపీపీఎస్సీ క్యాలెండర్ విడుదల చేసి యువ తకు ఉపాధి అవకాశాల కల్పన కోసం భవిష్యత్తు లో సమరశీల పోరాటాలకు కొనసాగించాలని రాష్ట్ర మహా సభలో తీర్మానం చేయడం జరిగిందని పై డిమాండ్లను సాధన కోసం ఏఐవైఎఫ్ గా రాష్ట్రవ్యాప్తంగా యువతలో చైతన్యం కలిగించి పోరాటం కొనసాగిస్తామని ఆయన తెలియజేశారు. ఏఐవైఎఫ్ నగర అధ్యక్ష కార్యదర్శులు నాగరాజు, బిసన్న, నగర ఆఫీస్ బేరర్స్ చంటి, రవి, శ్రీకాంత్, శివాజీ, శ్రీను, మధు, ప్రభాకర్ పాల్గొన్నారు.

సురేంద్రబాబు కుటుంబానికి అండగా ఉంటుంది

విశాలాంధ్ర - కర్నూలు : స్వర్గీయ సురేంద్ర బాబు కుటుంబాన్ని పరామర్శించిన ఏపీయూ డబ్ల్యూజే రాష్ట్ర కమిటీ ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఉమ్మడి జిల్లా కెమెరా మెన్ జగ్గుల సురేంద్రబాబు ఆకాల మృతితో ఆవేదన గురైన కుటుంబాన్ని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ రాష్ట్ర అధ్యక్షులు ఐవీ సుబ్బారావు, జిల్లా కార్యదర్శి నాగరాజుతో పాటు జిల్లా కమిటీ సిబ్బంది పరామర్శించారు. బుధవారం జగ్గుల సురేంద్రబాబు చిత్రపటానికి పూలతో నివాళులు అర్పించారు. అనంతరం ఏపీడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ సురేంద్రబాబు కుటుం బాన్ని అన్ని విధాల ఆదుకునేందుకు ఏపీయూ డబ్ల్యూజే అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈయన వెంట ఐజేయూ నాయకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దామోదర సంజీవయ్య జయంతిని ఘనంగా నిర్వహిస్తాం

విశాలాంధ్ర - కర్నూల్ ఎడ్యుకేషన్: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అయినటువంటి దివంగత దామోదర్ సంజీవయ్య 104 జన్మదిన వేడుకలు వైభవంగా జరపాలని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ కె.తులసీదేవి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఉత్సవంలో భాగంగా అందరూ జిల్లా అధికారులతో, జిల్లాలోని దళిత నాయకులతో ఉదయం 9 గంటలకు నంద్యాల చెక్ పోస్ట్ దగ్గర మీటింగ్ ఏర్పాటు చేశామని ఆమె తెలిపారు.

మున్సిపల్ కమిషనర్ అంటూ మోసగాళ్లు ఫోన్

విశాలాంధ్ర - ఆదోని : ఆదోని మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతున్నానని పన్నులు చెల్లించాలని పట్టణంలోని ప్రజలకు, వ్యాపారులకు 6300805117 ఈ నెంబర్ నుండి కాల్స్ వస్తే వెంటనే తమ పరిధిలోని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొంతమంది కేటుగాళ్లు, గుర్తు తెలియని వ్యక్తులు ప్రజలకు, వ్యాపారులకు 6300805117 నంబర్ నుండి ఫోన్ చేసి నేను ఆదోని మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతున్నానని నమ్మించి, బెదిరించి పెండింగ్లో ఉన్న పనులను వెంటనే చెల్లించకపోతే ఇంటిని, షాపులను జప్తు చేసి, నీటి కొళాయి కనెక్షన్ తొలగిస్తామని, ట్రేడ్ లైసెన్స్ బకాయిలు ఉన్నాయని ఎవరైనా కాల్ చేస్తే వెంటనే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణ సూచించారు. పెండింగ్ లో ఉన్న తమ పన్నుల కోసం ఆదోని పురపాలక సంఘం నుండి ఎవరికి ఎలాంటి ఫోన్లు చేయరని, పెండింగ్లో ఉన్న బకాయిల కోసం సచివాలయ సిబ్బంది, ఆదోని మున్సిపల్ సిబ్బంది వస్తారని ప్రజలు గమనించాల్సిన విషయమని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ అంటూ ఎవరైనా ప్రజలకు, వ్యాపారులకు పై తెలిపిన ఫోన్ నెంబర్ నుండి కాల్స్ వచ్చిన వెంటనే స్పందించి వారిపై ఫిర్యాదు చేయాలని కోరారు. కేటుగాళ్లు, సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఫోన్ పే, గూగుల్ పే ద్వారా పన్నులు చెల్లించాలని ఎవరైనా కాల్ చేస్తే ప్రజలు స్పందించకుండా ఉండాలని సూచించారు.

జేఈఈ మెయిన్స్‌లో నారాయణ ప్రభంజనం

కర్నూలు నారాయణ విద్యార్థిని విద్యార్థులు జేఈఈ మెయిన్ పరీక్ష ఫలితాల్లో ప్రభంజనం సృష్టించారని నారాయణ విద్యాసంస్థల డీజీఎం టి.గోవర్ధన్ రెడ్డి డిన్ లు ఆంజనేయ రెడ్డి, విశ్వనాథరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి బుధవారం తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నారాయణ కళాశాల టి.మధు సాయి కుమార్ 99.91, కే.జీవన్ కుమారణ 99.85, కే.చరణ్ కుమార్ 99.84, ఎస్.శివ ధనుష్ 99.48, కే.సాయి శృతి 99.43, ఎం.డి.ఖాజా ఫయోజన్ అహ్మద్ 99.43, కే. సాయి భాస్కర్ 99.21, డి.ధరణి 99.09 ఎన్.హర్షిత 98.87, ఎ.ఫణి శ్రీ సౌగంధ్ 98.81, కే.తన్మయి రెడ్డి 98.49, జె.ప్రవీణ్ కుమార్ 98.38, టి.రాహుల్ ఆరురూప్98.38, పి.దేవి శ్రీ చరణ్ 98.24, ఆర్. యోగేష్ కుమార్ 98.01, షేక్ మొహమ్మద్ జైద్ అహ్మద్ 97.76 ఎస్.సాయి మనస్ గౌడ్97.69, ఎస్.ఖరునుష 97.54, డి.మధు చైతన్య రెడ్డి 97.53, సాధించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎన్.సారిక, విజయ మోహన్, పి.సుజాత, అధ్యాపకులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

విశాలాంధ్ర - కౌతాళం: కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేసి, ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా చర్యలు చేపట్టాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య కోరారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా రైతులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తిమ్మయ్య మాట్లా డుతూ రాష్ట్రంలోని సన్న, మధ్యతరగతి రైతులు భూస్వాముల వద్ద వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకొని సాగు చేయడం జరుగుతుం దన్నారు. వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం నుండి ఎలాంటి సహకారం, బ్యాంకు బ్యాంకు రుణాలు అందడం లేదన్నారు. భూస్వాములకే బ్యాంకు రుణాలు ప్రభుత్వం నుండి సబ్సిడీ వాళ్లకే అందుతున్నాయన్నారు. దీంతో కౌలు రైతులు ఆర్థికంగానూ ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి, అర్హులైన రైతులందరికి గుర్తింపు కార్డులను మంజూరు చేయాలని తిమ్మయ్య డిమాండ్ చేశారు. కౌలు రైతులకు ఎలాంటి షరతులు లేకుండా బ్యాంకు రుణాలు రూ.2 లక్షల వరకు మంజూరు చేయాలని కోరారు. కౌలు రైతులు పండిస్తున్న పంటలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలే బీమా చెల్లించాలని కోరారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆర్ఐకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఈరన్న, రైతులు ఎంకన్న, నరసయ్య, మహమ్మద్, ఖాదర్ లింగ, వీరన్న పాల్గొన్నారు.

ఆదోని రూరల్..

వెల్దుర్తి..

పత్తికొండ..

మద్దికెర..

ఎమ్మిగనూరు..

ఆలూరు..

కల్లూరు..

గ్రామాలకు ప్రగతికళ

- జిల్లాలో రూ.131.28 కోట్లతో గోకులాలు - ఫారం పాండ్లు,
- ఉద్యాన తోటల పెంపకం, సిసి రోడ్ల నిర్మాణం
- రైతుల జీవన ప్రమాణాలు
- నికర ఆదాయ మార్గాల పెంపుదలకు కృషి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: పల్లె సీమల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు ముందుకు వేస్తోంది. పల్లెలకు పూర్వ వైభవం తీసుకురావాలనే ఆలోచనతో కూటమి సర్కార్ 'పల్లె పండుగ' పేరుతో రాష్ట్రంలో నూతన కార్యక్రమాన్ని చేపట్టి గ్రామాల అభివృద్ధికి ఒక కీలక ముందడుగు వేసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు 2024 ఆగస్టు 23న కర్నూలు జిల్లాలోని 484 పంచాయతీలలో గ్రామ సభలు నిర్వహించి పల్లె సీమలలో గోకులాలు, ఉద్యాన పండ్ల తోటల పెంపకం, ఫారం పాండ్లు, సీసీ రోడ్ల నిర్మాణాల పనులు చేపట్టాలని నిర్ణయించడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఉపాధి హామీ పథకం ద్వారా కర్నూలు జిల్లాలో రూ.131.28 కోట్లతో గోకులాలు, ఫారం పాండ్లు, ఉద్యాన పండ్ల తోటల పెంపకం, సిసి రోడ్ల నిర్మాణం చేపట్టడానికి జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా శరవేగంగా పరిపాలనపరమైన అనుమతులు మంజూరు చేశారు. ఈ మేరకు గ్రామాలలో సుస్థిర ఆస్తుల కల్పన నిమిత్తం విస్తృతంగా పనుల అమలుకు జిల్లా యంత్రాంగాన్ని వేగవంతం చేశారు. డ్వామా, పంచాయతీరాజ్ శాఖలను సమన్వయపరిచి గ్రామీణ ప్రాంతంలో రైతుల జీవన ప్రమాణాలు మరియు నికర ఆదాయ మార్గాల పెంపుదల కార్యక్రమాల అమలును ముమ్మరం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో గోకులాలు, ఫారం పాండ్లు, పండ్ల తోటల పెంపకం, సీసీ రోడ్ల నిర్మాణం పనులను ప్రభుత్వం చేపట్టడంతో రైతులు, ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.

పాడి రైతుల కోసం గోకులాలు: రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతుల ప్రయోజనార్థం గోకులం నిర్మాణాలను చేపట్టింది.. జిల్లాలో సన్న, చిన్నకారు రైతులు తమ స్థలం అనుకూలతను బట్టి గోకులం నిర్మాణానికి రెండు పశువులు ఉన్నవారికి యూనిట్ ధర రూ.1.15 లక్షలు, నాలుగు పశువులు కలిగిన వారికి రూ.1.85 లక్షలు, ఆరు పశువులు కలిగిన వారికి రూ.2.30 లక్షలు ఉపాధి మెటీరియల్ నిధులు మంజూరు చేశారు. ఇందులో కేవలం రైతులు 10 శాతం భరించగా, మిగిలిన 90 శాతం ఉపాధి నిధుల నుంచి మంజూరు చేశారు. అదేవిధంగా 20 గొర్రెలు/మేకలకు షెడ్లు వేసుకునే వారికి యూనిట్ ధర రూ.1.30 లక్షలు, 50 గొర్రెలు/మేకలు కలిగిన వారికి రూ.2.30లక్షలు, కోళ్ల ఫారాలకు 100 కోళ్లు పెట్టుకున్న వారికి షెడ్డు నిర్మాణానికి ఒక యూనిట్ కు రూ.87 వేలు, 200 కోళ్లు ఉన్నవారికి రూ.1.32 లక్షలు మంజూరు చేశారు. మేకలు, గొర్రెలు, కోళ్ల పెంపకం దారులకు 70 శాతం రాయితీతో ఉపాధి నిధులను మంజూరు చేశారు. జిల్లాలో మొత్తంగా 1020 షెడ్ల నిర్మాణానికి రూ.21.92 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి.. ఇప్పటికే 605 షెడ్లు నిర్మాణం పూర్తికాగా, మిగిలినవి తుది దశలో ఉన్నవి.

ఫారం పాండ్లు, ఉద్యాన తోటల పెంపకం: జిల్లాలో రూ.4.5 కోట్ల అంచనాతో 1252 ఫారం పాండ్లు మంజూరు కాగా, 274 పనులు చేపట్టి ఇప్పటికే 53 పనులను పూర్తి చేశారు. మిగిలినవి పురోగతిలో ఉన్నాయి. సన్న చిన్న కారు రైతుల సుస్థిర అభివృద్ధి కోసం రూ.37.36 కోట్ల అంచనాతో 4152 ఎకరాలలో 100 శాతం రాయితీతో మామిడి, సపోటా, చీని, నిమ్మ తదితర పండ్ల తోటల పెంపకం పనులు చేపట్టి పూర్తి చేయడం జరిగింది.

మినీ గోకులం పాడి రైతులకు వరం - మహబూబ్ బాషా, తడకనపల్లి గ్రామం: మా సొంత స్థలంలో 6 పశువులకు మినీ గోకులం నిర్మించుకున్నా..యూనిట్ విలువ 2,30,000 కాగా, ఉపాధి హామీ పథకం కింద 90శాతం సబ్సిడీతో 2,07,000 రూపాయలు మంజూరు చేశారు..23,000 రూపాయలు రైతు వాటా కింద జమచేసి మినీ గోకులం నిర్మాణం పూర్తి చేశాను. ఇంతకుముందు నా వద్ద ఉన్న గేదెలు, ఆవులన్నీ చెట్టు కింద ఖాళీ స్థలంలో కట్టివేసేవాడిని అవి ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఇబ్బంది పడుతూ ఉండేవి. వాటి ఆరోగ్యం పాడైపోతూ ఉండేది. పాల దిగుబడి తక్కువగా ఉండేది. ఇప్పుడు మినీ గోకులం నిర్మాణం పూర్తయిన తర్వాత పశువులు పరిశుభ్రమైన, ప్రశాంతమైన వాతావరణంలో ఉండడం వల్ల ఆరోగ్యంగా ఉండడమే కాకుండా పాల దిగుబడి సైతం సుమారుగా ఒక్కొక్క పశువుకి రెండు లీటర్ల చొప్పున పెరిగాయి. పశువులు పాము కాటుకి గురికాకుండా క్రిమి కీటకాల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉన్నాయి. గ్రామాలలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలలోని రహదారులను నిర్మించి గ్రామాలను అందంగా తీర్చిదిద్దుతున్నారు. మా గ్రామంలో బోయ మద్దిలేటి ఇంటి నుండి మసీదు వరకు సిసి రోడ్ ను నిర్మించారు. రోడ్ వేయడం వలన చాలా సౌకర్యంగా ఉందని, ఓర్వకల్లు మండల కేంద్రానికి చెందిన రఘురాముడు, సుబ్బరాయుడు రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందించారు.

వైద్య పరికరాలపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - కర్నూలు వైద్యశాల: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ధన్వంతరి హాల్‌లో కర్నూలు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ మెడికల్ సిబ్బందికి హెల్త్ కేర్ బయో మెడికల్ వైద్య పరికరాలపై హాస్పిటల్ సిబ్బందికి బుధవారం మధ్యాహ్నం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ పర్యవేక్షకులు డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సైరిక్స్ హెల్త్ కేర్ బయో మెడికల్ వైద్య పరికరాలపై, క్రిటికల్ కేర్ ఎక్విప్‌మెంట్స్‌పై, యూజర్ ట్రైనింగ్ సేక్షన్‌లో భాగంగా డీఫిబ్రిలేటర్, బీపీ, ఈసీజీ మానిటర్స్‌లకు ఆసుపత్రిలో ఉండే నర్సింగ్ సిబ్బందికి బయో మెడికల్ ఎక్విప్మెంట్ పై పేషంట్స్‌కు ఏ విధంగా కనెక్ట్ చేయాలి అన్నదానిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి డా.వెంకటేశ్వరరావు, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రమణ్యం, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డా.శివబాల నగాంజన్, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రి బాయి పాల్గొన్నారు.

దొడ్డనకేరి శివప్పను పరామర్శించిన కృష్ణమ్మ

విశాలాంధ్ర - ఆదోని రూరల్: మండలం లోని దొడ్డనకేరి గ్రామానికి చెందిన సర్పంచ్ పార్వతమ్మ భర్త టీడీపీ సీనియర్ నాయకులు కురువ శివప్ప వారం కిందట రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి, మాజీ ఇంచార్జ్ గుడిసె కృష్ణమ్మ బుధవారం దొడ్డనకేరి గ్రామానికి వెళ్లి పరామర్శించారు. సంబంధిత సంఘటన పట్ల కురువ శివప్పకు కాలు ఫ్రాక్చర్ కావడంతో వైద్యులు తెలిపిన సూచనలు, ఆరోగ్య స్థితిగతుల పట్లా అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే కోలుకునేందుకు వైద్యుల సూచనలు పాటిస్తూ మంచి పౌష్టిక ఆహారం తీసుకోవాలని ఆమె సూచించారు. కురువ శివప్ప త్వరగా కోలుకోవాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఆమె వెంట మురళి,రవి,బాబు రావు ఉన్నారు.

కుక్కలు బాబోయ్.. కుక్కలు

విశాలాంధ్ర-హొళగుంద: కుక్కలు బాబోయ్ కుక్కలు అంటే ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కేంద్రంలో వీధి కుక్కలు మందల కొద్దిగా తిరుగుతున్నాయి. వీధుల్లో తిరగాలన్న కష్టంగా ఉన్నదని, కుక్కలు వెంటపడి తరిమేస్తున్నాయని, కుక్కల బెడద నుండి వీధుల్లో తిరగలేక పోతున్నామని ప్రజలు వాపోయారు. కుక్కలకు గజ్జి వ్యాధి సోకి, ఇండ్లల్లోకి వస్తున్నాయని, వీటివల్ల పిల్లలకు, కుక్కల యజమానులకు గజ్జి రోగం అంటుకుందని అన్నారు. కుక్కలు ప్రధాన కూడళ్లల్లో అధిక సంఖ్యలో తిరుగుతున్నాయని, వీటి వల్ల తీవ్ర ఇబ్బంది కలుగుతుందని ప్రజలు ఆవేదన చెందారు. పిల్లల్లో కుక్కలు విపరీతంగా మారుస్తున్నాయని, దీనివల్ల నిద్రకు భంగం కలుగుతుందన్నారు. ప్రధాన వీధుల్లో కుక్కలు అధికంగా ఉండడం వల్ల విద్యార్థులను, పిల్లలను అంగన్వాడి కేంద్రాలకు, పాఠశాలలకు పంపించాలంటే భయంగా ఉందన్నారు. సంబంధిత అధికారులు కుక్కలను ఏరివేతకు చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు.

28లోపు ట్రేడ్ లైసెన్స్ ఫీజు బకాయిలు చెల్లించాలి

విశాలాంధ్ర - కర్నూలు సీటీ: ఈ ఆర్థిక సంవత్సరం ట్రేడ్ లైసెన్స్ ఫీజు బకాయిలు ఈ నెల 28లోపు చెల్లించాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఆర్జీవీ కృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలస్యంగా ట్రేడ్ లైసెన్స్ ఫీజు కట్టిన యెడల మార్చి 1వ తేదీ నుండి 25శాతం పెనాల్టీ, ఏప్రిల్ 1నుంచి 50శాతం పెనాల్టీ విధిస్తామని పేర్కొన్నారు. వ్యాపార, వాణిజ్య సముదాయముల యజమానులందరు షాప్ ట్రేడ్ లైసెన్స్ ఫీజును నగరపాలక సంస్థ నందు చెల్లించాలాన్నారు. ఎవరైనా ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించని యెడల మునిసిపల్ కార్పొరేషన్ ఆక్ట్ -1965 ప్రకారము సదరు షాపును మూసివేయడం తోపాటు బకాయి ఉన్న ట్రేడ్ లైసెన్స్ ఫీజును చట్ట ప్రకారంగా వసూలు చేస్తామని అదనపు కమిషనర్ హెచ్చరించారు.

నేడు కేదారేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట

విశాలాంధ్ర -వెల్దుర్తి: నేషనల్ హైవే-44 అనుకుని ఉన్న స్థానిక జర్నలిస్టు కాలనీలోని లక్ష్మీ వేంకటేశ్వర, అయ్యప్పస్వామి, సాయినాథ ఆలయ సమూహంలో కేదారేశ్వర స్వామి (అర్ధనారీశ్వరుడు) విగ్రహ ప్రతిష్టలు గురువారం జరుగనుంది. 13న ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఉంటుందని ఆలయ కమిటీ ప్రతినిధి యార్లపాటి శ్రీధర్ శర్మతెలిపారు.

విద్యార్థులను అభినందించిన గౌరు దంపతులు

విశాలాంధ్ర - కల్లూరు: మండల పరిధిలోని చిన్నటేకూరు గ్రామంలో ఉన్న ఐఐటీ మెడికల్ అకాడమీ జెఈఈ మెయిన్స్‌లో అర్హత సాధించిన 60 మంది విద్యార్థులను గౌరు దంపతులు అభినందించారు. ఈ మేరకు కల్లూరు అర్బన్ పరిధిలోని ఎమ్మెల్యే స్వగృహంలో విద్యార్థులకు అభినందన సభ కార్యక్రమం ఏర్పాటు చేసి విద్యార్థులను డిసిఓ ఆధ్వర్యంలో పలువురు అభినందించారు. అందులో 90శాతం శాతం దాటిన వారు 7 మంది విద్యార్థులను పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి ఉమ్మడి జిల్లా టీడీపీ సీనియర్ నాయకులు నందికొట్కూరు నియోజకవర్గం టీడీపీ ఇంచార్జి గౌరు వెంకట రెడ్డిలు మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో విద్యనభ్యసించే విద్యార్థులు మంచి మార్కులు సాధించి, కళాశాలతో పాటు జిల్లాకు మంచి పేరు తీసుకురావడం ఎంతో హర్షించదగ్గ విషయమన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని అధిరోహాలు అందుకొని ముందుకు సాగాలని వారు సూచించారు నిరుపేద విద్యార్థులకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీవో శ్రీదేవి, అకాడమీ అడ్వైసర్ బి.ఉమా మహేశ్వరప్ప, విద్యార్థులు నవీన్, నవదీప్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి

విశాలాంధ్ర - సి.బెళగల్: ప్రతి ఒక్కరూ మీ ఇంటి దగ్గర ఇంకుడు గుంతలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకువాలని ఎంపీడీఓ రాణెమ్మ అన్నారు. బుధవారం కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో జరిగిన సమీక్షలో ఆమె మాట్లాడారు. మండలానికి ప్రస్తుతం 143 ఇంకుడు గుంతలు మంజూరు అయ్యాయని, త్వరగా ఉపాధి హామీ పథకం కింద పనులు పూర్తిచేసుకొని ఇళ్ల ముందు మురుగు నీరు రోడ్లపైకి రాకుండా చూసుకోవాలని ఆమె అన్నారు. బీసీ రుణలకోసం ఈ నెల 15వ తేదీ వరకు గడువు పొడగింపు బీసీ కార్పొరేషన్ కింద బీసీ రుణాలు పొందెందుకు ఈనెల 15 తేదీ వరకు ప్రభుత్వం గడువు పెంచిందని, ఈ విషయాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చెత్త బుట్టలు పంపిణీ

విశాలాంధ్ర - తుగ్గలి: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారము గ్రామ పంచాయితీలకు చెత్త బుట్టలను ఎంపీపీ అద్దంకి ఎర్ర నాగప్ప, ఎంపీడీవో విశ్వ మోహన్, ఈఓఆర్డీ శ్రీహరి, టీడీపీ నాయకులు తుగ్గలి నాగేంద్ర, బత్తిన వెంకటరాముడు, తిమ్మయ్య చౌదరి, తదితరులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో విశ్వమోహన్, ఈఓఆర్డీ శ్రీహరిలు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో తమ ఇళ్లలో ఉన్న చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా ఒకే చోట వేసేందుకు ప్రభుత్వం చెత్తబుట్టలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. సర్పంచులు రవి, రాముల విజయ్, ఓబులేసు, రాము నాయక్, మధు బాబు చౌదరి, సుల్తాన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

భీమిలింగేశ్వర స్వామిని గ్రామంలో ఊరేగింపు

విశాలాంధ్ర- ఆలూరు: ఆలూరు కోటి వీధిలో వెలిసిన శ్రీ భీమలింగేశ్వర స్వామి దేవాలయం నందు మాఘ పౌర్ణమి సందర్భంగా స్వామి వారికి తెల్లవారుజామున పంచామృత అభిషేకం బిల్వార్చన సహస్ర శివ అష్టోత్తర శతనామావళి మహా మంగళారతి పూజ కార్యక్రమాలు శివ స్వాముల ఆధ్వర్యంలో జరిపారు. అనంతరం ప్రతి మాఘ పౌర్ణమికి శివపార్వతి విగ్రహాలను గ్రామములో ఊరేగింపు జరుపుతారు. ఈ పూజ కార్యక్రమంలో ఆలయ అర్చకులు మల్లికార్జున స్వామి, శివ రుద్ర స్వామి, సతీష్ స్వామి ఆలయ కమిటీ సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో...

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, గురువారం 13, ఫిబ్రవరి 2025

అవకతవకలు జరక్కుండా చూడాలి

విశాలాంధ్ర - ఆదోని రూరల్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అవకతవకలు జరగకుండా ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ సూచించారు. బుధవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏపీవో కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లుతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశాన్ని ఉద్దేశించి ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వలసలు నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకం ప్రజలకు ఎంతగానో తోడ్పడుతుందన్నారు. ప్రజలు వ్యవసాయ కూలీలు ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొలతలు తీయిస్తూ, వ్యవసాయానికి శాశ్వతంగా ఉపయోగపడే పనులు చేపట్టాలని ఆదేశించారు. ఉపాధి హామీ పనులకు హాజరయ్యే అర్హులకు అన్యాయం జరగకుండా తగిన కొలతలు తీయిస్తూ, తగిన వేతనాలు కల్పించే విధంగా కృషి చేయాలన్నారు. ఉపాధి హామీ సిబ్బంది ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధి కూలీలతో పనులు చేయించాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు,టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన కోట్ల

విశాలాంధ్ర - కోడుమూరు: పట్టణంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి తిరణాల మహోత్సవాలలో భాగంగా బుధవారం డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి,గ్రామ సర్పంచ్ భాగ్యరత్న, మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి అమ్మవారికి చీరసారే సమర్పించారు. కోడుమూరు మేజర్ గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో ప్రతిఏటా శ్రీ చౌడేశ్వరిదేవి తిరుణాల ఉత్సవాలను పురస్కరించుకొని అమ్మవారికి చీరసారె సమర్పించే కార్యక్రమం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు. ముందుగా స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం చేరుకున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యకు గ్రామ పంచాయతీ పాలకవర్గం, టీడీపీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఊరేగింపుగా బయలుదేరి అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఎమ్మెల్యే కోట్లసూర్య తదితరులకు అటగార దేవాంగ దైవాచార సంఘం సభ్యుల తోపాటు వేద పండితులైన అర్చకులు శ్రీనివాసవర్మ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్ రెడ్డి,కోట్ల కవితమ్మ, సర్పంచ్ భాగ్యరత్న, మాజీ జెడ్పీటీసీ విష్ణువర్ధన్ రెడ్డి,మాజీ సర్పంచ్ సీబీ లత, సీనియర్ నాయకులు కె.హేమాద్రిరెడ్డి, మధుసూదనరెడ్డిలకు పూలమాలలు వేసి, దుశ్శాలువలు కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి, సర్పంచ్ భాగ్యరత్న తదితరులు పట్టు వస్త్రాలు సమర్పించి,ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఈవో అజయ్ భాస్కర్, వార్డు సభ్యులు సీపీఐ రాజేశ్వరి, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆంధ్రయ్య,ఎద్దుల మహేశ్వరరెడ్డి, కిషోర్ గౌడ్,సిపిఐ నాయకులు రాజు,సిపిఎం నాయకులు కామర్తి రాజు, లింగం లక్ష్మయ్య శెట్టి తదితరులు పాల్గొన్నారు.

ఫైర్‌మెన్‌ను సస్పెండ్ చేసిన అధికారులు

విశాలాంధ్ర బ్యూరో -కర్నూలు: అగ్నిమాపక కేంద్రంలో ఫైర్ మాన్‌గా పనిచేస్తు ప్రస్తుతం సిక్ లీవ్‌లో ఉన్న ముదిగేడు రాజకుమార్‌ను బుధవారం సస్పెండ్ చేసినట్లు అదికారులు తెలిపారు. జిల్లా అగ్ని మాపక అధికారి కార్యాలయం నుండి ఏపీ రాష్ట్ర ముఖ్యమంత్రి ఫోటోను ఉద్దేశ పూర్వకంగా దొంగిలించినందుకుగాను, సిక్ లీవ్‌లో ఉండి, అతనికి ఏమాత్రం సంబంధం లేకపోయినా పత్తికొండ ఇన్చార్జి స్టేషన్ ఫైర్ ఆఫీసర్‌కు కాల్ చేసి మెన్ డ్యూటీ వివరాలు బెదిరింపు పూర్వకంగా అడిగినందుకుగాను, జాగ్రత్తగా ఉండండి అని హెచ్చరించినందుకు ఆయనను సస్పెండ్ చేసినట్లు తెలిసింది. సిక్ లీవ్‌లో ఉండి జిల్లా అగ్నిమాపక అధికారి కార్యాలయంలోని పరిసర ప్రాంతాల చుట్టూ పలుమార్లు అనుమానాస్పదంగా తిరగడం, సాయంత్రం పూట ఆఫీసుకు వచ్చి అనుమానాస్పదంగా ఫోటోలు తీయడం వంటి దుష్ప్రవర్తన, క్రమశిక్షణ రాహిత్యం అనే ఆరోపణలపైన బుధవారం ముదిగేడు రాజ్ కుమార్ ఫైర్ మాన్‌ను సస్పెండ్ చేయడం జరిగినట్లు డీఎఫ్ఓ అవినాష్ జయసింహ తెలిపారు. జిల్లా అగ్నిమాపక అధికారి కార్యాలయం నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి ఫోటోను దొంగిలించినందుకు గాను ఇతనిపైన త్రీ టౌన్ పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ సమర్పించడం జరిగింది.

ఘనంగా చిట్యాల తాత లాల్ స్వామి ఉరుసు

విశాలాంధ్ర - క్రిష్ణగిరి: చిట్యాల తాత లాల్ స్వామి ఉరుసు మహోత్సవం గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఏడాది తాత లాల్ స్వామి ఉరుసు మహోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతుంది. అదే తరహాలోనే బుధవారం తెల్లవారుజామున గంధంతో స్వామివారిని గుర్రం మీద పురవీధుల గుండా ఊరేగించారు. భక్తులు గ్రామస్తులు స్వామివారికి కాయ కర్పూరంతో మొక్కుబడులు తీర్చుకున్నారు. ఉరుసు సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు క్రికెట్, కబడ్డీ, బండ లాగుడు పోటీలను నిర్వహించారు. గ్రామంలో పుట్టింటి ఆడబిడ్డలు బంధుమిత్రులు రంగురంగుల బట్టలతో, లడ్డు మిఠాయి, గాజుల అంగళ్లతో ఆనందంగా మహోత్సవాన్ని జరుపుకున్నారు. ఉరుసు సందర్భంగా వెల్దుర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ మధుసూదన్ రావు ఆధ్వర్యంలో ముందస్తు జాగ్రత్తగా గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. క్రిష్ణగిరి ఎస్సై మల్లికార్జున, వెల్దుర్తి ఎస్ఐ అశోక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పౌర్ణమి వేడుకలు

విశాలాంధ్ర - కల్లూరు: గురు పౌర్ణమి వేడుకలు పురస్కరించుకొని భక్తులు దేవాలయాలకు పెద్ద ఎత్తున కుటుంబ సమేతంగా చేరుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేయడంతో దేవాలయాలు కిటకిట లాడాయి. ఈ మేరకు బుధవారం మండల పరిధిలోని చిన్నటేకూరు, బస్తిపాడు, సల్కాపురం, ఎ.గోకులపాడు, నెరవాడ, పర్ల, కల్లూరు అర్బన్ ఆయా వార్డులలో వెలిసిన శిరిడి సాయిబాబా, ఆంజనేయ స్వామి ఆలయాల్లో భక్తులు ఉదయాన్నే చేరుకొని ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేపట్టారు. దేవాలయాల దగ్గర భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు నీటి వసతి టెంట్లు భోజన కార్యక్రమాలు వాహనాల రాకపోకల ఏర్పాట్లు తదితర వాటిని కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన కమిటీ సభ్యులు ప్రజాప్రతినిధులు, పెద్దలు భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

డమరుకం బహుకరించిన భక్తుడు

విశాలాంధ్ర -గోనెగండ్ల: మండల పరిధిలోని వెలసిన శ్రీ రేణుక ఎల్లమ్మ అవ్వ దేవాలయంకు ఫార్మసిస్ట్ కృష్ణయ్య అలియాస్ కిట్టు తనయుడు ప్రదీప్ దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి దేవాలయంకు డమరుకం బహూకరించారు. అనంతరం కిట్టు మాట్లాడుతూ మండలంలో దాదాపు ఐదేళ్ల నుంచి ప్రతి దేవాలయానికి డమరుకం బహూకరిస్తుంటానని, ఈ సంవత్సరం గోనెగండ్ల ఊరి బయట సమీపంలో వెలసిన శ్రీ రేణుక ఎల్లమ్మ అవ్వ దేవాలయంకు డమరుకం బహూకరించడం జరిగిందని, ఇలా చేయడం వల్ల సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో కష్టాలు లేకుండా జీవిస్తున్నాన న్నారు. ప్రథమ చికిత్స వైద్యులు డాక్టర్ నాగేష్ రెడ్డి, దోమ నరసయ్య, దోమ నాగరాజు, ప్రతిప్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

హాజరుతో సంబంధం లేకుండా అనుమతివ్వాలి

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: కర్నూలులోని క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ చదివే విద్యార్థులకు హాజరుతో సంబంధం లేకుండా సెమిస్టర్ పరీక్షలకు అనుమతించాలని కోరుతూ బీసీ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ బాబు విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి వైస్ ఛాన్సలర్ వేణుగోపాల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆనంద్ బాబు మాట్లాడుతూ జిల్లాకు చెందిన విద్యార్థులు వెనుకబడిన సామాజిక వర్గాలకు చెందినవారే ఉన్నారు. రాష్ట్రంలోనే కర్నూలు జిల్లా అత్యంత వెనుకబడిన, వ్యవసాయ ఆధారిత కుటుంబాలు ఉన్న ప్రాంతం కావడంతో విద్యార్థులు పలు రకాల కారణల వల్ల కళాశాలలకు పూర్తిస్థాయిలో, సకాలంలో హాజరు కాకపోవడం సాధారణ విషయం. విద్య, ఉపాధి అవకాశాలు కర్నూలు జిల్లా వాసులకు అత్యంత ఆవశ్యకం. విద్యార్థుల గైర్హాజరు కారణాలను పరిశీలించి డిగ్రీ విద్యార్థులను తదుపరి సెమిస్టర్ పరీక్షలకు అనుమతించాలని ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్‌కి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు జయకృష్ణ, ఆనంద్, చందు, జతిన్ పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన బీరప్ప దేవర ఉత్సవాలు

విశాలాంధ్ర -సి.బెళగల్ : మండల పరిధిలోని పల్దొడ్డి గ్రామంలో బీరప్ప దేవర ఉత్సవాలను పెద్దలు, ఆలయ నిర్వాహకులు బుధవారం ఘనంగా ముగించారు. ఆలయంలో గత మూడు రోజులుగా బీర లింగేశ్వర దేవర ఉత్సవాలు జరుగుతుండగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. అలాగే బుధవారం చివరి రోజున బీరప్ప స్వామి, కమలమ్మలకు కల్యాణ కార్యక్రమం చేపట్టి సంప్రదాయం, సంస్కృతులను ఉట్టిపడేలా అలంకరించారు. అనంతరం ఊరేగింపుగా పల్లకి సేవా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ పల్లకి సేవా కార్యక్రమంలో గ్రామంలోని పిల్లలు పెద్దలు అందరూ పాల్గొన్నారు.

గిరిజన పాఠశాలలో విద్యార్థులకు అన్నదానం

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : మండలంలోని అహోబిలం ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ప్రధానార్చకులు కీడాంబి వేణుగోపాలన్ స్వామి కుమారుడు కీడాంబి మధుసూధన్ స్వామి వివాహ వార్షికోత్సవం, స్వర్గీయ అర్చకులు కృష్ణమాచారి వర్ధంతి సందర్భంగా సుమారు రెండు వందల మంది విద్యార్థిని, విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యాలు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

49 మంది విద్యార్థులు గైర్హాజరు

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: ఇంటర్ ఒకేషనల్ కళాశాలలో ప్రాక్టికల్ నిర్వహించినట్లు ఆర్ ఐ ఓ గురువయ్య శెట్టి బుధవారం ఒక ప్రకటన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 66 సెంటర్లో ప్రాక్టికల్స్ నిర్వహించమన్నారు. ఈ ప్రాక్టికల్ 3353 దరఖాస్తు చేసుకోగా 3304 విద్యార్థి విద్యార్థులు హాజరయ్యారు. 49 మంది హాజరు కాలేకపోయారు ఎలాంటి మాస్ కాఫీ తావు ఇవ్వకుండా జాగ్రత్తలు చేపట్టినారు. ఈ పర్యవేక్షంలో డి ఈ వి వో పరమేశ్వర్ రెడ్డి తదితరులు పరివేక్షించారు.

స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలి

విశాలాంధ్ర- సి.బెళగల్: ఈ నెల 15న శని వారం జరుప బోవు స్వర్ణాంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని పండుగ వాతా వరణంలో ఘనంగా నిర్వహించాలని ఈఓఆర్డి ఈశ్వరయ్య స్వామి అధికారులకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని మండల అభివృద్ధి కార్యాలయంలోని ఈ ఓఆర్డి ఆఫీసులో స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ దివస్‌లో భాగంగా పంచాయతీ కార్యదర్శులు ఆయా గ్రామాల సర్పంచ్, ప్రజా ప్రతిదులు మరియు గ్రామ పెద్దలకు ముందుగా తెలిపి, షెడ్డు దగ్గర పండుగ వాతావరణము కల్పించే విధంగా ఏర్పాట్లు చేయాలని, ఈ విషయాలను పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్ర మంలో ఈఓఆర్డీ ఈశ్వరయ్య స్వామి తోపాటు అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ మఠంలో జిల్లా ఎస్పీ

విశాలాంధ్ర - మంత్రాలయం: మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామిని దర్శించుకునేందుకు కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ బుధవారం మంత్రాలయం వచ్చారు. వీరు ముందుగా గ్రామదేవత మంచాలమ్మ శ్రీ రాఘవేంద్ర స్వామి మూలబృందావనంకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అంతకు ముందు వీరికి శ్రీ మఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహ మూర్తి స్వామి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈయనతో పాటు ఎమ్మిగనూరు డిఎస్పీ ఉపేంద్ర బాబు, మంత్రాలయం ఎస్ఐ శివాంజల్, ఎస్పీ ఎస్ఐ వేణు గోపాల్ రాజ్, హెడ్ కానిస్టేబుళ్ రాఘవేంద్ర తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు తనిఖీ

విశాలాంధ్ర - శిరివెళ్ల: మండల పరిధిలోని యర్రగుంట్ల మేజర్ గ్రామపంచాయతీలో పలు అంగన్వాడీ కేంద్రాలను సర్పంచ్ సుభాను వలి ఈవో ఆధ్వర్యంలో ఎంపీడీఓ సి.శివ మల్లేశ్వరప్ప బుధవారం తనిఖీ చేశారు. 1,2 అంగన్వాడి కేంద్రాలను తనిఖీ చేసి కేంద్రాలను ఉదయం 9 గంటలకల్లా తెరావాలని గర్భిణీలు, బాలింతలకు, పిల్లలకు సేవలు అందించాలని అన్నారు. అంగన్వాడి కేంద్రానికి సప్లై చేసిన ఆహార పదార్థాలు పాలు, గ్రుడ్లు, పప్పు, బాలమృతం మొదలైనవి నాణ్యమైనవా కావా అని పరిశీలించిన తర్వాతనే బయోమెట్రిక్ వేసి సప్లయర్ నుండి తీసుకోవాలని సూచించారు. పోషకాహార నిల్వలను భద్రపరచు కోవాలని, ప్రతిరోజు ఆరోగ్యలక్ష్మి పథకంలో భాగంగా గర్భిణీలు, బాలింతలకు, ప్రీస్కూల్ పిల్లలకు వండిన పోషకాహారం కేంద్రంలోనే అందించాలని, గర్భిణీ, బాలింతలు, పిల్లల నమోదు ప్రకారం హాజరు ఉండాలని తెలిపారు. అంగన్వాడి టీచర్లు, ఆయాలు తమ విధులలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించకుండా తగిన జాగ్రత్త వహించాలని ఎంపిడిఓ పేర్కొన్నారు.

డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: క్లస్టర్ యూనివర్సిటీ మొదటి సెమిస్టర్ డిగ్రీ ఫలితాలు విడుదల చేసిన వీసీ క్లస్టర్ యూనివర్సిటీ మొదటి సెమిస్టర్ డిగ్రీ ఫలితాలు వైస్ ఛాన్సర్ ఆచార్య డివిఆర్ సాయి గోపాల్ బుధవారం విడుదల చేశారు. ఈ పరీక్షలు డిసెంబర్ నిర్వహించామని, మొత్తం 872 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 415మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని క్లస్టర్ యూనివర్సిటీ డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ కె.నాగరాజ్ శెట్టి తెలిపారు. 48శాతం శాతం మంది యూనివర్సిటీ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. రివాల్యుయేషన్‌కు అప్లై చేసుకునే విద్యార్థులు ఈ నెల 21 తేదీ లోపల చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ కె.బాలసుబ్రమణ్యం, డాక్టర్ ఎ.విజయలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ రమణయ్య పాల్గొన్నారు.

పెండింగ్ ఉన్న కేసులు పరిష్కరించుకోవాలి

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: ప్రజలకు సత్వర న్యాయం అందించాలనే లక్ష్యంతో 8వ తేదీ మార్చి, 2025న కర్నూలు, నంద్యాల జిల్లాలలోని అన్ని న్యాయ స్థానాల్లో పెండింగ్ లో ఉన్న రాజీ పడదగిన సివిల్, మోటార్ ఆక్సిడెంట్ కేసులు, క్రిమినల్ మరియు ప్రిలిటిగేషన్ కేసులు పరిష్కరించకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి తెలిపారు. ఈ అవకాశమును కక్షిదారులు అందరూ ఉపయోగించుకోవాలని, తమ తమ కేసులను రాజీ పూర్వకంగా పరిష్కరించుకోవాలని కోరారు. ఇందులో భాగంగా కార్యదర్శి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, కర్నూలు వారు అన్ని మండల న్యాయ సేవధికర సంస్థల సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీలైనన్ని పెండింగ్లో ఉన్న రాజీ కాబడిన కేసులను పరిష్కరించడంలో శ్రద్ధ చూపించాలని కోరారు.

బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ఎన్నికల ముందు బీసీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కోడుమూరు మాజీ ఎమ్మెల్యే, పి.మురళి కృష్ణ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశంలో మురళీకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గెలిచి ఆరు నెలలు గడిచినా 143 బీసీ కులాలు ఉన్నాయని, ఏ ఒక్క కులానికి న్యాయం జరగలేదన్నారు. బీసీలకు అన్యాయమే జరిగిందని, కూటమి ప్రభుత్వం గెలిచాక బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలన్నారు. నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలన్నారు. బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారని, వారికి ఎలాంటి ఆర్థిక సహాయం చేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ ఎస్సీ బజారన్న, మైనార్టీ డిపార్ట్మెంట్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్ పాల్గొన్నారు.

గుర్తింపు సంఖ్య తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలి

విశాలాంధ్ర - ఆదోని రూరల్: వ్యవసాయ పొలాలు ఉన్న ప్రతి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరిగా నమోదు చేయించు కోవాలని మండల వ్యవసాయ అధికారి అశోక్ కుమార్ రెడ్డి రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని కపటి, పెసలబండ గ్రామాలలో బుధవారం రైతు సేవ కేంద్రాలలో రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి అశోక్ కుమార్ రెడ్డి నేతృత్వంలో సహాయ వ్యవసాయ సంచాలకులు బలవర్ధి రాజు పర్యవేక్షించి అనంతరం రైతులతో మాట్లాడారు. రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యతో వ్యవసాయ సేవలను సులభతరం చేసి పారదర్శకంగా మరింత రైతులకు అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు కేంద్ర,రాష్ట్ర వ్యవసాయ శాఖ కృషి చేయడం జరుగుతుందన్నారు. భూ ఆధారిత వ్యవ సాయ రాయితీ పథకాలైనటువంటి పీఎం కిసాన్ చెల్లింపులు, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు, రాయితీపై సూక్ష్మ పోషకాలు, సూక్ష్మ సేద్యంపై రాయితీ, పంట రుణాలు, పెట్టుబడి సాయం తదితర పథకాలు నేరుగా అర్హులైన రైతులు పొందడానికి విశిష్ట గుర్తింపు సంఖ్య అధికారిక గుర్తింపుగా పనిచేయడం జరుగుతుందని గుర్తు చేశారు. గ్రామాలలో రైతు సేవ కేంద్రాల సిబ్బందిని రైతులు సంప్రదించి రైతు గుర్తింపు సంఖ్యను నమోదు చేయించుకోవడానికి ఆధార్ కార్డు, ఆధార్ కార్డుకు లింక్ అయినా ఫోన్ నెంబర్, భూమి రికార్డుల వివరాలు (పట్టాదారు పాసు పుస్తకం 1బి) వెంట తీసుకువెళ్లి తప్పనిసరిగా నమోదు చేయించుకుని గుర్తింపు సంఖ్యను పొందాలని విజ్ఞప్తి చేశారు.

అవశేషాల్లేని పంటకు స్కోప్ సర్టిఫికెట్

విశాలాంధ్ర - వెలుగోడు : వెలుగోడు గ్రామం నందు మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండ్ గ్యాప్ పొలంబడి కార్యక్రమంను ఆత్మకూరు ఏడి ఆంజనేయ పరిశీలించారు. వారు మాట్లాడుతూ రైతులు మేలైన యాజమాన్య పద్ధతుల ద్వారా నాణ్యమైన పంటలు పండించి పురుగుమందు అవశేషాలు లేని పంటలకు ప్రభుత్వం నుంచి స్కోప్ సర్టిఫికేట్ పొందగలరని తెలిపారు. అలాగే మాధవరం గ్రామంలో సాగుచేసిన టీబీజీ-141 టీబీజీ-104 విబిఎన్ 8రకాలైన మినుము మినీ కిట్ పైరును వారు పరిశీలించారు. బోయ రేవుల గ్రామం నందు నిర్వహించిన పోలం పిలుస్తుంది కార్యక్రమానికి విచ్చేసి రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని రైతులను కోరారు. పొలంబడి ,ఫార్మర్ రిజిస్ట్రేషన్ యొక్క ఉపయోగాలను రైతులకు వివరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం అందించు పథకాలు సబ్సిడీలు వర్తింప చేయడానికి కచ్చితంగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని, రైతులందరూ సంబంధిత రైతు సేవ కేంద్రం వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ సిబ్బంది సుధారాణి, రామకృష్ణ, నాగలింగం, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు బీసీ రాజారెడ్డికి ఆహ్వానం

విశాలాంధ్ర - బనగానపల్లె : జిల్లాలో ప్రముఖ శైవ క్షేత్రమైన యాగంటిలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డిని ఆహ్వానించారు. ఆలయ ఈవో చంద్రుడు, యాగంటిపల్లె ఉపసర్పంచ్ మౌలిశ్వర్ రెడ్డి, ఆలయ అర్చకులు బుధవారం బిసి రాజారెడ్డిని కలిసి మహాశివరాత్రి సందర్భంగా యాగంటి క్షేత్రంలోజరిగే బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా బిసి రాజారెడ్డి చేతుల మీదుగా శ్రీ ఉమామహేశ్వర స్వామివార్ల కళ్యాణ, రథ, వసంతోత్సవ, తెప్పోత్సవముల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. అనంతరం బిసి రాజారెడ్డి మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని యాగంటి ఉమామహేశ్వర స్వామివార్లను దర్శించుకునేందుకు వేలాదిమంది భక్తులు తరలి వస్తారని వారికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో చంద్రుడు ఉప సర్పంచ్ బండి మౌలిశ్వర్ రెడ్డి, తిరుమలయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రి బీసీని కలిసిన పలువురు

విశాలాంధ్ర- బనగానపల్లె: వెలగపూడి సచివాలయంలో మంత్రి కార్యాలయంలో రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, మాజీ ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణరాజు ఈ సందర్భంగా కొండపి నియోజకవర్గంలోని రోడ్ల అభివృద్ధి సమస్యలపై మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు.

శ్రీ జంబులా పరమేశ్వరి దేవి బోనాల పండుగ కార్యక్రమంలో ఫయాజ్

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల స్థానిక బైటిపేట శ్రీ జంబులా పరమేశ్వరి దేవి దేవస్థానం నందు జరిగిన బోనాల పండుగ మహోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫయాజ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ బోనాలు పండుగ జరగడం చాలా సంతోషంగా ఉందని,నంద్యాల నలుమూలల నుంచి ప్రజల భక్తిశ్రద్ధలతో బోనాలు తీసుకొని వచ్చి అమ్మవారికి సమర్పించారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి జిల్లెల్ల శ్రీరాములు, అశోక్, కాంట్రాక్టర్ రవి, కామిని మల్లికార్జున, కొమ్ము హరి, కిరణ్, కాజా పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడలను ప్రారంభించిన డోన్ ఎమ్మెల్యే కోట్ల

విశాలాంధ్ర - కోడుమూరు : నియోజకవర్గ కేంద్రమైన కోడుమూరు పట్టణంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి తిరణాల మహోత్సవాలను పురస్కరించుకొని శ్రీచౌడేశ్వరిదేవి తిరుణాల ఉత్సవాల స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రామీణ క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలను డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. శ్రీ చౌడేశ్వరిదేవి తిరుణాల సందర్భంగా ఉత్సవాల స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతర సంబరాలు బుధవారం ఉదయం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని స్థానిక కోట్ల సర్కిల్ వద్ద శ్రీ చౌడేశ్వరిదేవి తిరుణాల ఉత్సవాల స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో గ్రామీణ క్రీడలను డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్ రెడ్డి, గ్రామ సర్పంచ్ బి.భాగ్యరత్నతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా కోట్ల సూర్య మాట్లాడుతూ తిరుణాల సందర్భంగా ఆటలపోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు,జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

దేశ, రాష్ట్ర అభివృద్ధి ప్రధాని మోదితోనే సాధ్యం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ప్రధాని నరేంద్ర మోడితోనే సాధ్యమని నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మదు పేర్కొన్నారు. గోస్పాడు మండలం ఎం.కృష్ణా పురం గ్రామంలో వైసిపికి చెందిన కార్యకర్తలు భారీగా జిల్లా అధ్యక్షులు అభిరుచి మదు సమక్షంలో పార్టీలో చేరారు. గ్రామానికి చెందిన శివరామి రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, వడ్ల పెద్ద ఆచారి, వడ్ల చెన్న కేశవాచారి, శంకర్ రెడ్డి, మల్లు శంకర్ రెడ్డి, సింగం రామచంద్రా రెడ్డి, గుండం నరసింహారెడ్డి, శ్రీనివాస రెడ్డి, దండే చంద్రశేఖర్ రెడ్డి, ఎస్ కన్నయ్య, సి ఈశ్వరయ్య, గుండం లక్ష్మికాంతరెడ్డి, హుస్సేన్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, అమరేశ్వరరెడ్డి, రామకృష్ణా రెడ్డి, గోపాల ఆచారి, సుబ్రమణ్యఆచారి బిజెపి లో చేరారు. అంతకుముందు జిల్లా అధ్యక్షులు అభిరుచి మదు గ్రామానికి చేరుకోవడంతో ఘన స్వాగతం పలికారు. గ్రామంలో రోడ్డు వెంట పూలవర్షం కురిపిస్తూ భారీ పూలమాలలు వేసి, పుష్పగుచ్ఛాలు అందించారు. గ్రామంలో మహిళలు ఆయన వద్దకు వెళ్లి ఎన్నో సమస్యలు ఎదుర్కోంటున్నామని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం గ్రామంలో ఏర్పాటుచేసిన సభలో ఆయన పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత కేంద్రం నుంచి నిధులు వరదలా వస్తున్నాయన్నారు. నంద్యాలలో బిజెపి పార్టీ బలోపేతానికి కృషి చేయడానికి బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురంధేశ్వరి ఆదేశాల మేరకు కార్యకర్త స్థాయి నుంచి జిల్లా అధ్యక్ష పదవి లభించిందని అన్నారు. బిజెపి పెద్దలతో మాట్లాడి కృష్ణాపురం గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గోస్పాడు మండల అధ్యక్షులు మదు గోపాల్, చల్లా మదు, కశెట్టి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.